క్లుప్తంగా

కలెక్టర్‌కు మేయర్ సన్మానం



వరంగల్ అర్బన్: వరంగల్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి స్మార్ట్ సిటీ సమావేశంలో పాల్గొనడానికి (ఇన్‌చార్జ్ కమిషనర్‌గా) ప్రధాన కార్యాలయానికి వచ్చిన ప్రావీణ్యకు నగర మేయర్ గుండు సుధారాణి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ప్రావీణ్యను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బల్దియా డిప్యూటీ కమిషనర్ అనిసుర్ రషీద్, జేఏసీ అధ్యక్షుడు గౌరీశంకర్, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీహెచ్ఓ శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ వెంకన్న, ఈఈలు రాజయ్య, బిఎల్.శ్రీనివాస రావు, సంజయ్ కుమార్, డీఈలు రవికుమార్, నరేందర్, సంతోష్ బాబు, సారంగం, రవికిరణ్, స్మార్ట్ సిటీ ప్రతినిధి ఆనంద్ ఓలేటి పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సహజం



హన్మకొండ: ఉద్యోగ విరమణ అనేది ప్రతీ ఉద్యోగికి సహజమని టీఎస్ ఆర్టీసీ వరంగల్ -1 డిపో మేనేజర్ శ్రీనివాసరావు అన్నారు. హనుమకొండలోని వరంగల్ -1 డిపోలో ఐదుగురు ఉద్యోగులు శుక్రవారం పదవి విరమణ పొందగా వారికి ఆత్మీయ వీడ్కోలు అభినందన సమావేశం నిర్వహించారు. వారిని డిపో మేనేజర్ శ్రీనివాసరావు, సహోద్యోగులు సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రిటైర్డ్ అయిన వారికి సంస్థ నుంచి అందాల్సిన ప్రయోజనాలను సకాలంలో అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ట్రాఫిక్ మేనేజర్లు భవాని, రాజేశ్వరరావు, శ్రీనివాస్, ఏడీసీ వీరన్న పాల్గొన్నారు.

వర్సిటీ విద్యార్థులపై అక్రమ కేసులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘం నాయకులపై అక్రమ కేసులు పెట్టారని ప్రగతిశీల ప్రజాస్వామిక విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కన్నా ఒక ప్రకటనలో తెలిపారు. సంఘర్షణ సభకు అనుమతివ్వాలని పేర్కొన్నారు.

అరెస్టులను ఖండిస్తూ నేడు కేయూ బంద్

విద్యారణ్యపురి: కాకతీయ యూనివర్సిటీలోని విద్యార్థి జేఏసీ నాయకుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ ఏప్రిల్ 1వ తేదీన ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ బంద్ నిర్వహించనున్నట్లు ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలన భవనం వద్ద వీసీ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

రెడ్డి కార్పొరేషన్ సాధించే వరకు పోరాటం



హన్మకొండ: రెడ్డి కార్పొరేషన్ సాధించే వరకు తాను విశ్రమించబోనని, పోరాటం చేస్తూ ఉంటానని రెడ్డి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్ రెడ్డి అన్నారు. ఇటీవల రెడ్డి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన గోపు జయపాల్‌రెడ్డిని రెడ్డి సంఘం ఆధ్వర్యంలో హనుమకొండలో శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్డీలందరిని ఏకం చేయడానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో రెడ్డి జేఏసీ, రెడ్డి సంఘం నాయకులు కేతిరి దామోదర్‌రెడ్డి, రాదారపు సంజీవరెడ్డి, కటంగురు రాంగోపాల్ రెడ్డి, నాగవెల్లి కేశవ రెడ్డి, సమ్మిరెడ్డి, బక్కారెడ్డి, పానకల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, దొంతి వెంకట్‌రెడ్డి, నోముల వెంకట్ రెడ్డి, కామిడి సతీష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వీసం రమణారెడ్డి, క్రాంతిరెడ్డి పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



మామునూరు: కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామంలోని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు పోతుగంటి రాజశేఖర్ సూచించారు. ఖిలా వరంగల్ మండలం అల్లీపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న శిబిరాన్ని 18 ఏళ్ల పైబడిన వారందరు వినియోగించుకోవాలని కోరారు. శుక్రవారం శిబిరంలో 281 మందికి కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మోహన్‌సింగ్, క్యాంపు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయ్‌కుమార్, క్యాంపు కోఆర్డినేటర్ జి.సంపూర్ణ, సుష్మలత, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బుస్స వెంకన్న, ముప్ప నర్సయ్య, ఆర్‌పీ లక్కరాణి, కె.అరుణ, కంచర్ల అనిల్, శీలం సాంబశివ పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు



మాట్లాడుతున్న కార్పొరేటర్ శివకుమార్



హాల్‌టికెట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రవి

హసన్‌పర్తి: ప్రణాళికతో చదవితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ అన్నారు. హసన్‌పర్తి జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రంలో ఆందోళనకు గురికావొద్దని, ప్రశాంతంగా పరీక్ష రాయాలని సూచించారు. హెచ్ఎం కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చకిలం రాజేశ్వర్‌రావు, విద్యాభివృద్ధి కమిటీ చైర్మన్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు హాల్ టికెట్ల పంపిణీ

ఖిలా వరంగల్: వరంగల్ - కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు డి.రవి ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు తొమ్మిదో తరగతి విద్యార్థులు శుక్రవారం వీడ్కోలు పలికారు. ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ మరుపెల్లి రవి హాజరై హెచ్ఎంతో కలిసి విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులు విలువైన సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని చెప్పారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, ఇనాయత్ అక్తర్, శ్రీకాంత్, రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



చిరుధాన్యాలను ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



ఖిలా వరంగల్: అవగాహన కల్పిస్తున్న సృజన

కాశిబుగ్గ: చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ఈక్రమంలో ప్రతిఒక్కరూ ఆహారంలో చిరుధాన్యాలు తీసుకోవాలని 19వ డివిజన్ కార్పొరేటర్ ఓని స్వర్ణలత, సీడీపీఓ విశ్వజ సూచించారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా కాశిబుగ్గలోని మహిళా స్వశక్తి భవనంలో చిరుధాన్యాలపై మహిళలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పూర్వీకులు చిరుధాన్యాలు ఆహారంగా తీసుకోవడం వల్లే ఎలాంటి వ్యాధులు లేకుండా ఆరోగ్యంగా జీవించారని గుర్తుచేశారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు, మహిళలు తప్పకుండా చిరుధాన్యాలను తినాలని చెప్పారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఓని భాస్కర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ చాయాదేవి, టీచర్లు స్రవంతి, భవాని, వాణి, కవిత, వనిత, సరిత, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

పడమర కోటలో..

ఖిలా వరంగల్: చిరుధాన్యాల వినియోగంతోనే పెద్దలు, పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారని కార్పొరేటర్ బైరబోయిన ఉమ సూచించారు. పోషణ్ పక్షం లో భాగంగా పడమరకోట కాపు వాడలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జె.సృజన అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతరం, చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలను ప్రదర్శించారు. అనంతరం చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ధైర్యంగా పరీక్షలు రాయండి



ఫోన్‌ఇన్‌లో మాట్లాడుతున్న డీఈఓ వాసంతి

కాశోజీ సెంటర్: ఏప్రిల్ 3 నుంచి టెన్త్ వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ధైర్యంగా పరీక్షలు రాయాలని డీఈఓ వాసంతి సూచించారు. శుక్రవారం టెన్త్ విద్యార్థులు, తల్లిదండ్రుల సందేహాల నివృత్తి కోసం ఏర్పాటు చేసిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులంతా 10/10 జీపీఏ సాధించి జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. హాల్‌టికెట్లు స్కూల్ యాజమాన్యం ఇవ్వకపోతే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షలకు హాజరవ్వాలని సూచించారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు ఉంటుందని, కేటాయించిన పరీక్ష కేంద్రానికి అరగంట ముందే చేరుకోవాలన్నారు. నిబంధనల మేరకు భౌతిక శాస్త్రం పరీక్ష ఉదయం 9:30 నుంచి 11 గంటల వరకు, జీవశాస్త్రం పరీక్ష 11:30 నుంచి 12:50 వరకు ఒకే రోజు వేర్వేరుగా రాయాల్సి ఉంటుందని, ఆందోళన చెందొద్దని సూచించారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి జి.కృష్ణమూర్తి, ఏసీజీ డీసీపీ నరసింహారావు, శ్రీధర్ పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో గణితం కీలకం



విజేతలకు బహుమతులు అందజేసిన అతిథులు

విద్యారణ్యపురి: శాస్త్ర, సాంకేతిక రంగాల్లో గణితం కీలకమని హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి అన్నారు. హనుమకొండలోని రీజినల్ సైన్స్ సెంటర్ ఆధ్వర్యంలో కేడీసీలో గణిత దినోత్సవ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గణితంపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్విజ్, ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ కోఆర్డినేటర్ అశోక్‌కుమార్, ప్రాజెక్టు అసోసియేట్ కీర్తివివేక్, కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్, గణిత శాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ ప్రభాకర్, అధ్యాపకులు వెంకటేష్, డాక్టర్ వెంకన్న వేణుగోపాల్, రాధిక, శ్రీనివాస్, కమలాకర్, సోమనర్సయ్య పాల్గొన్నారు.

ఫైలేరియా పరీక్షలకు 14బృందాలు



గీసుకొండ: జిల్లాలో ముందుగా గుర్తించిన గ్రామాల్లో ఫైలేరియా పరీక్షల కోసం 14 వైద్య బృందాలను ఏర్పాటు చేసి ఈనెల 3న రక్తపూతలు సేకరించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జాతీయ ఫైలేరియా నిర్మూలన కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారులు, సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణలో ఆయన పలు సూచనలు చేశారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ చల్లా మధుసూదన్ మాట్లాడుతూ.. వైద్య బృందాలు జిల్లాలో ఫైలేరియా నిర్మూలనకు కృషి చేయాలన్నారు. దీని కోసం స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలన్నారు. ఏఎంఓ మాడిశెట్టి శ్రీనివాస్, డెమో అనిల్‌కుమార్, డీడీఎం నితిన్, హెల్త్ సూపర్‌వైజర్ పాలకుర్తి సదానందం, పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్ని మతాలకు సమ ప్రాధాన్యం



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రమేష్

హసన్‌పర్తి: అన్ని కులాలు, మతాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. 55వ డివిజన్ భీమారంలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి వరంగల్ బిషప్ డాక్టర్ ఉడుముల బాలతో కలిసి ఎమ్మెల్యే రమేష్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా సర్కారు పనిచేస్తోందని అన్నారు. డాక్టర్ ఉడుముల బాల మాట్లాడుతూ అరూరి గట్టుమల్లు మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలను కొనియాడారు. స్థానిక కార్పొరేటర్ జక్కుల రజిత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అటికం రవీందర్, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, టీఆర్‌కే రెడ్డి, చర్చి అధ్యక్షుడు సంగాల ప్రేమ్‌కుమార్, చర్చి పాస్టర్ అంబటి బాల, రైతుబంధు సమితి జిల్లా కార్యవర్గ సభ్యుడు విక్టర్, డివిజన్ మాజీ గౌరవ అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దేవస్థాన కమిటీ చైర్మన్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమలో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం



బ్రాహ్మణవాడలో పర్యటిస్తున్న జంగా రాఘవరెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తలు

హన్మకొండ చౌరస్తా: వచ్చే ఎన్నికల్లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా హనుమకొండలోని 7వ డివిజన్‌లో శుక్రవారం పర్యటించారు. బ్రాహ్మణవాడలో యాత్ర ప్రారంభం కాగా, డివిజన్‌లోని అన్ని ప్రాంతాలను తిరుగుతూ ప్రజల సమస్యలను జంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమీ లేదని ఆరోపించారు. ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్‌లకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్, విజయశ్రీరజాలీ, కాంగ్రెస్ నాయకులు రేపల్లె శ్రీనాథ్, కట్ల శ్రీనివాస్, రేపల్లె రంగనాథ్, కొడిపాక గణేష్, సందుపట్ల ధన్‌రాజ్, స్వరాజ్యం, రజిత, గోవర్ధన్, సుగుణ, మాధవి, స్వరూప, మండల సమ్మయ్య, సందెల విజయ్ పాల్గొన్నారు.

బీజేపీతోనే రాష్ట్రం మరింత అభివృద్ధి



స్థానికులతో మాట్లాడుతున్న రావు పద్మ

కాజీపేట: దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న బీజేపీ.. రాష్ట్రంలో కూడా అధికారంలోకి వస్తే మరింతగా అభివృద్ధి జరుగుతుందని జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. కాజీపేట 62వ డివిజన్‌లో ఇంటింటికి బీజేపీ పేరుతో పలు కాలనీల్లో శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర నర్సింగ్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు భగవాన్‌దాస్ ఉపాధ్యాయ, పుల్యాల రవీందర్‌రెడ్డి, కె.జీవన్ ప్రకాష్, మంతుర్తి కిరణ్, సుంచు ప్రశాంత్, విజయ్ పాల్గొన్నారు.

విద్యార్థి ఉద్యమకారులపై అక్రమ కేసులు

హన్మకొండ: విద్యార్థి ఉద్యమకారులపై ప్రభుత్వం, పోలీసులు అక్రమ కేసులు నమోదు చేస్తూ వేధిస్తున్నారని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ విమర్శించారు. పోలీసులు అరెస్ట్ చేసిన కాకతీయ విద్యార్థి జేఏసీ నాయకులను హనుమకొండలోని కేయూ పోలీసుస్టేషన్‌లో రావు పద్మ శుక్రవారం పరామర్శించారు. అనంతరం కేయూ ఇన్‌స్పెక్టర్ దయాకర్‌తో మాట్లాడారు. విద్యార్థులపై అక్రమ కేసులు నమోదు చేయడం అన్యాయమని వాపోయారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేశిని సదానందం గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి పుప్పాల రజనీకాంత్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ తోపుచెర్ల మధుసూదన్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

మట్టెవాడ ఇన్‌స్పెక్టర్‌గా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ

రామన్నపేట: వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పర్యవేక్షణకు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు.

సీపీని కలిసిన ఇన్‌స్పెక్టర్



వరంగల్ క్రైం: మట్టెవాడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం, వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

రైల్వే గూడ్స్ షెడ్డులో వైద్య శిబిరం

కాశిబుగ్గ: కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఎరువుల సంస్థ ఆధ్వర్యంలో వరంగల్ రైల్వే గూడ్స్ షెడ్డులో హమాలీ కార్మికులకు శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని డివిజనల్ హెచ్‌ఆర్ సుధాకర్, సీనియర్ జోనల్ మేనేజర్ సజన్ కుమార్, ఆవేజ్ మేనేజర్ శ్రీధర్లతో కలిసి కోరమాండల్ రీజినల్ లాజిస్టిక్ మేనేజర్ వీవీఎస్ శేషుకుమార్ ప్రారంభించారు. సుమారు 300 మంది హమాలీ కార్మికులు, లారీ డ్రైవర్లు, స్థానిక మహిళలకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో కంపెనీ వరంగల్ మార్కెటింగ్ అధికారులు సుమన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నరేష్, సౌత్ సెంట్రల్ షావుకార్ హమాల్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు కక్కె సారయ్య, ముఖద్దములు ఆయూబ్ ఖాన్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఆస్పీస్' సెంటర్ ఏర్పాటు



నయీంనగర్: వృద్ధులతో పాటు జీవిత చరమాంకంలో ఉండి నయం కాని జబ్బుపడిన (క్యాన్సర్, డిమెన్షియా) వారి కోసం ఏర్పాటు చేసిన ఆస్పీస్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సాయి సేవా ట్రస్ట్ కోశాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. హనుమకొండ వడ్డేపల్లి సప్తగిరి కాలనీలో సాయి సేవా ట్రస్ట్ 40మంది అనాథలు, 40 మంది వృద్ధులకు భోజనం, 260 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తోందన్నారు. అలాగే, మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. సమావేశంలో అభిషేక్, శుభమ్, ఆష్నా, అనహిత తదితరులు పాల్గొన్నారు.

బేబక్క సంతాపసభను జయప్రదం చేయండి

ఖిలా వరంగల్: ఏప్రిల్ 1వ తేదీన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గుండంపల్లిలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బేబక్క సంతాపసభను జయప్రదం చేయాలని పార్టీ గ్రేటర్ వరంగల్ కార్యదర్శి ఆరెల్లి కృష్ణ, నాయకుడు బండి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈమేరకు ఖిలా వరంగల్ మధ్యకోటలో బాలరాజు ఆధ్వర్యంలో బేబక్క సంతాపసభ కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. అలాగే, 6న కొత్తగూడ, 10న నర్సంపేటలో సంతాప సభ ఉంటుందని వారు వివరించారు. కార్యక్రమంలో గంద్రాతి హరిబాబు, ఇనుమల కృష్ణ, రాజు, నారాయణ, ప్రభాకర్, ఏలియా పాల్గొన్నారు.

వడుప్సా మండల జోన్ కమిటీ ఎన్నిక

ఖిలా వరంగల్: వడుప్సా మండల జోన్ కమిటీని శుక్రవారం ప్రకటించారు. అధ్యక్షుడిగా ఫోర్ట్‌రోడ్డు టాలెంట్ హైస్కూల్ కరస్పాండెంట్ ముక్కెర రవీందర్, కార్యదర్శిగా కరీమాబాద్ కీవీ హై స్కూల్ కరస్పాండెంట్ దాసి సతీష్‌మూర్తి, కార్యదర్శిగా దాసి సతీష్‌మూర్తి, కోశాధికారిగా బి.సుధీర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

హసన్‌పర్తి: నగరంలోని భీమారానికి చెందిన వలుస శివ నగేష్‌కు మంజూరైన రూ.1.50 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును అతడి ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే అరూరి రమేష్ శుక్రవారం అందజేశారు. అలాగే, అనారోగ్య కారణంతో మృతి చెందిన పృథ్వీ, అంకూస్ యాదవ్, అటికం కొంరయ్య కుటుంబాలను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ జక్కుల రజిత, డివిజన్ అధ్యక్షుడు అటికం రవీందర్, మాజీ కార్పొరేటర్ వెంకటేశ్వర్, యూత్ అధ్యక్షుడు సాయి, కుడా మాజీ డైరెక్టర్ రమేష్‌యాదవ్ ఉన్నారు.

రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో 'బలగం' ప్రదర్శన



బలగం సినిమా వీక్షిస్తున్న సభ్యులు

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్ ప్రాంగణంలో శుక్రవారం రాత్రి ఇన్‌స్టిట్యూట్ కమిటీ ఆధ్వర్యంలో ప్రొజెక్టర్ ద్వారా ఓటీటీలో వచ్చిన బలగం సినిమాను ప్రదర్శించారు. తెలంగాణలో బంధాలు, బంధుత్వాలను కళ్లకు కట్టినట్లు చూపెట్టిన సినిమాను చూసి ఆనందం వ్యక్తం చేసినట్లు దేవులపల్లి రాఘవేందర్, ఎం.రాజయ్య, గిరిమిట్ల రాజేశ్వర్‌రావు తెలిపారు. ఇన్‌స్టిట్యూట్ సభ్యుల విజ్ఞప్తి మేరకు శనివారం రాత్రి 7గంటలకు సినిమాను రెండవసారి ప్రదర్శించనున్నట్లు వారు తెలిపారు.

మెట్టుగుట్టపై మూలమంత్ర హోమం



మడికొండ: హోమం చేస్తున్న అర్చకులు, భక్తులు



కాజీపేట: పూజ చేస్తున్న కార్పొరేటర్ దంపతులు

మడికొండ: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మడికొండలోని మెట్టుగుట్టపై ఉన్న సీతారామచంద్ర స్వామి దేవాలయంలో శుక్రవారం ఉదయం లక్ష్మీ మూలమంత్ర హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంత్రం హోమం, బలిహరణ, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శేషుభారతి , ఆలయ చైర్మన్ దువ్వ నవీన్ దంపతులు, అర్చకులు పరాశరం విష్ణువర్ధన చార్యులు, రాగిచేడు అభిలాష్‌శర్మ, పారుపల్లి సత్యనారాయణ శర్మ, ధర్మకర్తలు భూపాల్‌రెడ్డి, ఓర్సు రాజు, బుర్ర సంధ్యారాణి, ప్రభాకర్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ సోమిడిలోని అభయాంజనేయ స్వామి దేవాలయ ఆవరణలో శ్రీరామ పట్టాభిషేకాన్ని శుక్రవారం నిర్వహించారు. 27 ఏళ్లుగా ఆలయంలో సీతారామ కల్యాణ వేడుకలు ముగిసిన తర్వాత రాముడికి పట్టాభిషేకం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ వ్యవస్థాపకుడు, శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం ఆస్థాన పండితులు అయినవోలు రాధాకృష్ణశర్మ ఆధ్వర్యంలో కనులపండువగా పట్టాభిషేకం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ - రమ దంపతులు.. దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు.

కిసాన్ ర్యాలీని విజయవంతం చేయండి



కార్మికులతో మాట్లాడుతున్న రమేష్

మడికొండ: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 5వ తేదీన ఢిల్లీలో నిర్వహించనున్న మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ పిలుపునిచ్చారు. ఈమేరకు మడికొండ - రాంపూర్ ఇండస్ట్రీయల్ ప్రాంతంలో శుక్రవారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు అంటూ అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం.. ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, నిత్యావసరాల ధరలు పెంచుతూ పేద ప్రజలపై పెనుభారం మోపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ సంపదను అంబానీ, అదానీ కంపెనీలకు దోచిపెడుతోందని విమర్శించారు. కార్మిక వ్యతిరేఖ కోడ్‌లను రద్దుచేయాలని, పంటలకు గిట్టుబాటు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులను 200 రోజులకు పెంచుతూ రోజుకు రూ.600 చొప్పున వేతనం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో గడ్డం అశోక్, సీఐటీయూ నాయకులు కే.శ్రీనివాస్, సతీష్, సంగాల మొగిలి, రాజు, రాజేందర్, శ్రీనివాస్, లింగమూర్తి పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థికి దాతల చేయూత



సమ్మయ్యను సన్మానిస్తున్న రోహిత్, తదితరులు

కేయూ క్యాంపస్: మణిపూర్ రాష్ట్రానికి చెందిన రోహిత్.. కాకతీయ యూనివర్సిటీలో బీఫార్మసీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొంది చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా రోహిత్ ఆత్మహత్యాయత్నానికి యత్నించగా, సహచర ఫార్మసీ విద్యార్థులు ఆస్పత్రిలో చేర్పించారు. ఇప్పుడు పూర్తిగా కోలుకున్న రోహిత్‌కు చదువు పూర్తయ్యేవరకు ఖర్చును అలుమ్నీ విద్యార్థులు, అధ్యాపకులు, భరించనున్నట్లు ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య శుక్రవారం తెలిపారు. దాంతో ప్రొఫెసర్ సమ్మయ్యను రోహిత్‌తో పాటు విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో ఫార్మసీ డీన్ నర్సింహారెడ్డి, ప్రొఫెసర్లు కృష్ణవేణి, ప్రసాద్, డాక్టర్ స్వరూపరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై కల్వర్టు నిర్మాణం



పనులను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ

కాజీపేట: కాజీపేట ప్రధాన రహదారిపై కల్వర్టు నిర్మాణ పనులను వేగవంతం చేయడానికి ఎన్‌హెచ్, ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టారు. రహదారిపై కల్వర్టు లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే జూబ్లీ మార్కెట్ ప్రాంతం నీట మునుగుతోంది. ప్రజల ఆకాంక్ష మేరకు అధికారులతో చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్ సమీక్ష సమావేశం నిర్వహించి కల్వర్టు నిర్మాణ పనులు చేయాలని సూచించారు. వెంటనే అధికారులు రంగంలోకి దిగి శుక్రవారం మార్కింగ్ చేయడంతో జేసీబీల సహాయంతో పనులు ప్రారంభించారు. ప్రధాన రహదారి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ పర్యవేక్షణలో పనులు సాగుతున్నాయి. వనవే పద్ధతి ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి పనులు చేపట్టారు.